సాక్షి సంగారెడ్డి

శనివారం, 18, అక్టోబర్, 2025



అప్రమత్తతతోనే ఆనందకేళి

దీపావళి సందర్భంగా బాణసంచా కాల్చే సమయంలో జాగ్రత్తలు పాటించాలని నిపుణులు చెబుతున్నారు. వివరాలు IIలో ▸



రసమయి ఫాంహౌజ్‌పై దాడి

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకుల మధ్య విబేధాలతో బెజ్జంకి మండలంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వివరాలు IIలో ▸



ఎదురుచూపులు ఇంకెన్నాళ్లు

ఉపాధి హామీ పనుల పెండింగ్ బిల్లులు ఎప్పుడు విడుదల అవుతాయోనని కూలీలు ఎదురుచూస్తున్నారు. వివరాలు IIIలో ▸

న్యూస్‌రీల్

'బంద్‌కు సంపూర్ణ మద్దతు'

నారాయణఖేడ్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్ల సాధన కోసం బీసీ సంఘాల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించనున్న రాష్ట్రవ్యాప్త బంద్‌కు సంపూర్ణ మద్దతునిస్తున్నట్లు లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ప్రకాశ్‌రాథోడ్, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు అలిగే జీవన్ కుమార్, ఖేడ్ నియోజకవర్గ భీమ్ ఆర్మీ అధ్యక్షుడు అనుముల తుకారాం, సీపీఐ జిల్లా నాయకులు చిరంజీవి వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు.

బంద్‌కు ఎంపీ మద్దతు

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు శనివారం నిర్వహించనున్న రాష్ట్ర బంద్‌కు సంపూర్ణ మద్దతునిస్తున్నట్లు జహీరాబాదు ఎంపీ సురేశ్ షెట్కార్ తెలిపారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి: రఘునందన్‌రావు

జిన్నారం (పటాన్‌చెరు): క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలని ఎంపీ రఘునందన్‌రావు పేర్కొన్నారు. గుమ్మడిదల పట్టణ కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని శుక్రవారం రఘునందన్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ...బీజేపీ బలోపేతానికి క్షేత్రస్థాయిలో ప్రతీ కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు.

బీసీ బంద్‌కు బీఆర్‌ఎస్ మద్దతు

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి: బీసీ వర్గాల హక్కుల సాధన కోసం శనివారం తలపెట్టిన రాష్ట్రవ్యాప్త బంద్‌కు తమ పార్టీ మద్దతు ప్రకటించిందనీ, జిల్లా ప్రజలు బంద్‌ను విజయవంతం చేయాలని జిల్లా బీఆర్‌ఎస్‌పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పిలుపునిచ్చారు. 42% బీసీ రిజర్వేషన్ అమలు కోసం రాష్ట్రవ్యాప్త బంద్ ఒక శాంతియుత నిరసన రూపమని, బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. బీసీల అభివృద్ధి కోసం ఇది ఒక ఆవశ్యక దశ అని పేర్కొన్నారు.

21న ఉమ్మడి జిల్లా రగ్బీ పోటీలకు ఎంపిక

నారాయణఖేడ్: జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్‌ఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 21న ఉదయం 10 గంటలకు ఖేడ్‌లోని ఈ-తక్షిల పాఠశాల గ్రౌండ్‌లో ఉమ్మడి మెదక్ జిల్లాస్థాయి అండర్-19 రగ్బీ పోటీలకు క్రీడాకారుల ఎంపిక చేయనున్నారు. ఈ మేరకు ఎస్‌ఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి గణపతి శుక్రవారం ప్రకటనలో వెల్లడించారు. పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న 19 ఏళ్లలోపు వయస్సుగల బాలబాలికలు అర్హులన్నారు. పూర్తి సమాచారం కోసం 91772 41933, 99595 52635, 96660 44630 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

డ్రగ్స్ తయారు చేస్తే కఠిన చర్యలే

జిల్లా ఔషధ నియంత్రణ శాఖ అధికారి రాము

సంగారెడ్డి: జిల్లాలో ఎక్కడైనా నిషేధిత మాదక ద్రవ్యాలు, ఉత్ప్రేరకాలైన డ్రగ్స్ తయారు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఔషధ నియంత్రణ శాఖ అధికారి రాము హెచ్చరించారు. నార్కోటిక్ డ్రగ్స్, సైకోట్రోపిక్ సబ్‌స్టెన్సెస్ వంటి డ్రగ్స్ తయారీ కార్యకలాపాలు ఉంటే టోల్ ఫ్రీ నం 180059 96969తోపాటు జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌కు సమాచారం ఇవ్వాలని శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు.

గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరి

ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు




ఆస్పత్రికి రిఫ్రిజరేటర్‌ను అందజేస్తున్న గౌరెడ్డి శ్రీధర్‌రెడ్డి

కొండాపూర్(సంగారెడ్డి): ప్రతీ రైతు తమ పశువులకు గాలికుంటు నివారణ టీకాలను తప్పనిసరిగా వేయించాలని ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు సూచించారు. మండల కేంద్రమైన కొండాపూర్‌లో పశువులకు పశువైద్య సిబ్బంది శుక్రవారం చేపట్టిన గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమంలో వెటర్నరీ అధికారి వెంకటరమణారెడ్డితో ప్రభు పాల్గొని మాట్లాడారు. టీకాల కార్యక్రమం నవంబర్ 14వ తేదీ వరకు కొనసాగుతుందని పశు పోషకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా తొగర్‌పల్లి కాంగ్రెస్ నాయకులు గౌరిరెడ్డి శ్రీధర్ రెడ్డి పశువుల ఆస్పత్రిలో మందులను నిల్వచేసేందుకు గానూ రిఫ్రిజరేటర్‌ను బహుమతిగా అందజేశారు.

డీసీసీ రేసులో కొత్త పేర్లు

జిల్లా అధ్యక్ష పదవి ఎంపిక ప్రక్రియలో కీలక పరిణామాలు

- ఉజ్వల్‌రెడ్డితోపాటు, మాజీమంత్రి చంద్రశేఖర్ దరఖాస్తు
- ఎంపీ, ఖేడ్ ఎమ్మెల్యేల సోదరులు నగేశ్‌షెట్కార్, చంద్రశేఖర్‌రెడ్డి సైతం
- ఆశావహులతో కొనసాగుతున్న ఏఐసీసీ పరిశీలకురాలు సిజరిట ఇంటర్వ్యూలు



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్ష పదవి నియామక ప్రక్రియలో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ పదవి రేసులో ప్రధానంగా నలుగురు ముఖ్య నాయకులు ఉన్నారు. జహీరాబాద్‌కు చెందిన ఉజ్వల్‌రెడ్డితో పాటు, అదే నియోజకవర్గం నుంచి గత ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన మాజీమంత్రి చంద్రశేఖర్ కూడా ఈ పదవిని ఆశిస్తున్నారు. మరోవైపు జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్ సోదరుడు నగేశ్ షెట్కార్, ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి సోదరుడు చంద్రశేఖర్‌రెడ్డిలు సైతం ఈ పదవి కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో పలువురు ద్వితీయ శ్రేణి నాయకులు సైతం తమకు అవకాశం కల్పించాలని దరఖాస్తులు చేసుకున్నారు. దీంతో ఈ పదవి కోసం వచ్చిన దరఖాస్తుల సంఖ్య ఏకంగా 20కి మించిపోయింది. కానీ ప్రధానంగా పైన పేర్కొన్న నలుగురు పేర్లు పరిశీలనలో ఉన్నట్లు కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి.

నియోజకవర్గాల వారీగా సమావేశాలు

పార్టీ సంస్థాగత నిర్మాణంపై దృష్టి సారించిన కాంగ్రెస్ అధిష్టానం ఈ డీసీసీ పదవి నియామక ప్రక్రియను ఈసారి కాస్త భిన్నంగా చేపట్టింది. ఏఐసీసీ పరిశీలకులతోపాటు, పీసీసీ నుంచి ముగ్గురు కోఆర్డినేటర్లను నియమించింది. జిల్లాలో ఉన్న ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహించి మండల, బ్లాక్ కాంగ్రెస్, వివిధ విభాగాల బాధ్యుల అభిప్రాయ సేకరణ చేపట్టింది. ఇందులోభాగంగా జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో ఈ సమావేశాలు జరిగాయి. డీసీసీ అధ్యక్ష పదవి కోసం దరఖాస్తులు చేసుకున్న సుమారు 20 మందికి పైగా నాయకులతో సిజరిట ముఖాముఖి ఇంటర్వ్యూలు నిర్వహించారు. శుక్రవారం 15 మంది ఆశావహులను ఇంటర్వ్యూలు చేశారు. మిగిలిన వారిని శనివారం ఇంటర్వ్యూలు చేస్తారని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు.

ఉజ్వల్‌రెడ్డి వైపు అగ్రనేతల మొగ్గు !

జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకత్వం ఉజ్వల్‌రెడ్డి వైపు మొగ్గు చూపుతున్నారు. మంత్రి దామోదర రాజనర్సింహతోపాటు, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కూడా ఉజ్వల్ పేరును సూచించారు. అలాగే పటాన్‌చెరు నియోజకవర్గం ఇన్‌చార్జిగా ఉన్న కాటా శ్రీనివాస్‌గౌడ్, జహీరాబాద్ నియోజకవర్గానికి చెందిన సెట్విన్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ గిరిధర్‌రెడ్డి వంటి వారు కూడా ఉజ్వల్‌రెడ్డిని ప్రతిపాదిస్తూ టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు లేఖలు ఇచ్చినట్లు తెలిసింది. మరోవైపు డీసీసీ రేసులో ప్రధానంగా ఉన్న ఉజ్వల్‌రెడ్డితో కలిసి మంత్రి దామోదర రాజనర్సింహ ఇటీవల ఢిల్లీలోని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేను కలవడం ఆసక్తికరంగా మారింది. ఇక ఎంపీ షెట్కార్ సోదరుడు నగేశ్ షెట్కార్ కూడా డీసీసీ అధ్యక్ష పదవి కోసం దరఖాస్తు చేసుకున్నారు. దీంతో ఇదే నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్యే సంజీవరెడ్డి సోదరుడు చంద్రశేఖర్‌రెడ్డి కూడా నేను సైతం అంటూ డీసీసీ పదవికి దరఖాస్తు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఖేడ్ నియోజకవర్గంలో పార్టీ శ్రేణులు ఇప్పటికే రెండు వర్గాలుగా కొనసాగుతున్న సంగతి తెలిసిందే. మరోవైపు జహీరాబాద్ నియోజకవర్గంలోనూ వర్గ పోరు నెలకొన్న నేపథ్యంలో ఇక్కడి నుంచి ఉజ్వల్‌రెడ్డితోపాటు, మాజీ మంత్రి చంద్రశేఖర్ కూడా డీసీసీ రేసులోకి రావడం ఆసక్తి కరంగా మారింది. మొత్తం మీద అధికార కాంగ్రెస్ పార్టీలో డీసీసీ ఎన్నిక ప్రక్రియ రసవత్తరంగా సాగుతోంది. కాగా, అభిప్రాయాలను సేకరించి ఆరుగురు పేర్లను అధిష్టానానికి పంపుతామని ఏఐసీసీ పరిశీలకులు సిజరిట ఇప్పటికే ప్రకటించారు. అయితే పార్టీ అధిష్టానం ఎవరికి గ్రీన్ సిగ్నల్ ఇస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

డీసీసీ పదవికి అభిప్రాయ సేకరణ

నేతలతో సమావేశమైన ఏఐసీసీ పరిశీలకురాలు సిజరిట

జహీరాబాద్/ఝరాసంగం(జహీరాబాద్): కాంగ్రెస్ పార్టీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షపదవి ఎన్నిక కోసం ఏఐసీసీ పరిశీలకురాలు సిజరిట పార్టీ ముఖ్య నేతలతో సమావేశమై అభిప్రాయాలు సేకరించారు. శుక్రవారం జహీరాబాద్‌లోని ఎస్‌వీ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గంలోని ముఖ్యనాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. జిల్లా అధ్యక్ష పదవి కోసం పార్టీ అధిష్టానవర్గం నిర్ణయించిన రిజర్వేషన్ వివరాలను ఈ సందర్భంగా వెల్లడించారు. అనంతరం బ్లాకుల వారీగా ముఖ్యనేతలతో ప్రత్యేక గదిలో సమావేశమయ్యారు. వారి నుంచి వ్యక్తిగత వివరాలు తీసుకుని నమోదు చేశారు. ఈ సమావేశంలో జహీరాబాద్ నియోజకవర్గం నుంచి ముగ్గురు నేతలకు సంబంధించిన పేర్లను పార్టీ నాయకులు ప్రస్తావించినట్లు తెలిసింది. బ్లాక్ స్థాయి నేతల సమావేశం పూర్తయ్యాక మాజీ కౌన్సిలర్లు, మాజీ ఎంపీపీలు, మాజీ జెడ్పీటీసీలతో సైతం సమావేశమై వారి అభిప్రాయాలను కూడా తీసుకున్నారు. సేకరించిన వివరాలను అధిష్టానవర్గానికి పంపిస్తామని సిజరిట తెలిపారు. సమావేశంలో మాజీమంత్రి ఎ.చంద్రశేఖర్, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎస్.గిరిధర్‌రెడ్డి, ఐడీసీ మాజీ చైర్మన్ ఎం.డి.తన్వీర్, జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఎస్.ఉజ్వల్‌రెడ్డి,



సమావేశంలో మాట్లాడుతున్న సిజరిట

ఆత్మ చైర్మన్ రామలింగారెడ్డి, కేతకీ చైర్మన్ చంద్రశేఖర్, సీడీసీ చైర్మన్ ముబీన్, మాజీ జెడ్పీటీసీలు భాస్కర్‌రెడ్డి, నాగిశెట్టిరాథోడ్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అస్మా తబస్సుం, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేతకీలో పూజలు

కేతకీ సంగమేశ్వరాలయాన్ని సిజరిట సందర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన ఆమెకు మండల కాంగ్రెస్ శ్రేణులతోపాటు అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. గర్భగుడిలోని పార్వతీ పరమేశ్వరులకు అభిషేకం, కుంకుమార్చన, మహా మంగళహారతి తదితర ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ విశిష్టత గురించి తెలుసుకున్నారు. అనంతరం పూలమాల, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హన్మంత్‌రావు పాటిల్, నాయకులు రాజ్ కుమార్ స్వామి, సంగమేశ్వర్, రామ్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లపై చట్టం చేయాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: బీసీ రిజర్వేషన్లపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్‌లో చట్టం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని కొత్త బస్టాండ్ వద్ద శుక్రవారం బీసీ రిజర్వేషన్‌పై బీజేపీ ద్వంద్వ వైఖరిని నిరసిస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ..బీసీ రిజర్వేషన్లపై బీజేపీ ద్వంద్వ వైఖరి అవలంబిస్తుందన్నారు. రాష్ట్రంలో 42% బీసీ రిజర్వేషన్లను కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం అడ్డుకోవడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు.



దీపం ముగ్గు వేసిన విద్యార్థులు

ఘనంగా దీపోత్సవం

ఖేడ్ నియోప్రగతి ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన దీపోత్సవ కార్యక్రమంలో ఇలా విద్యార్థులు పాఠశాల గ్రౌండ్‌లో దీపం ఆకారంలో ముగ్గువేసి దీపాలను వెలిగించారు. దీపావళి పండుగ విశిష్టతను ప్రిన్సిపాల్ కమ్మరి ప్రకాశ్ విద్యార్థులకు వివరించారు. – నారాయణఖేడ్

మోడల్ స్కూల్‌కు తాగునీటి సౌకర్యం

అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

మునిపల్లి(అందోల్): త్వరిత గతిన మోడల్ స్కూల్ విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. మండల కేంద్రమైన మునిపల్లి మోడల్ స్కూల్‌ను శుక్రవారం అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేసి విద్యార్థుల మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మోడల్ స్కూల్ బాలికల హాస్టల్‌లో నిర్వహిస్తున్న పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా భోజన నాణ్యతను గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు వసతి, సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులకు కంప్యూటర్‌పై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ వెంట ఏఎంసీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, తహసీల్దార్ గంగాభవాని, ఉప తహసీల్దార్ ప్రదీప్, ఎంపీడీఓ హరినందన్‌రావుతోపాటు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మల్లిక సంబంధిత అధికారులున్నారు.

మరో రెండేళ్లలో వచ్చేది మేమే

మాజీమంత్రి కేటీఆర్

పటాన్‌చెరు: మరో రెండేళ్లలో అధికారంలోని తామే వస్తామని వచ్చిన తర్వాత అభివృద్ధిని వేగవంతం చేస్తామని మాజీమంత్రి కేటీఆర్ తెలిపారు. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని మెడికల్ డివైస్ హ్యావెల్ లైసెన్స్ పరిశ్రమలో వారు తయారు చేసిన ఉత్పత్తులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...సామాన్యుడికి ధరలు అందుబాటులో వచ్చేందుకు ఈ మెడికల్ డివైస్ పార్క్ కేసీఆర్ హయాంలోనే ఏర్పాటు చేశామన్నారు. సామాన్యుడికి అందుబాటులో ఉండేవిధంగా పరిశోధనలు చేయటం పట్ల ఆయన పరిశ్రమ యాజమాన్యాన్ని అభినందించారు.



కలెక్టరేట్ ముందు నిరసన వ్యక్తం చేస్తున్న జర్నలిస్టు సంఘాల నాయకులు


పత్రికా స్వేచ్ఛను కాలరాయడమే

'సాక్షి'మీడియా పట్ల ఏపీ ప్రభుత్వ వైఖరిపై పాత్రికేయ సంఘాల ఆందోళన

- 'సాక్షి'పై, ఎడిటర్ ధనంజయ్‌రెడ్డిపై కేసులు, వేధింపులకు నిరసనగా..
- కలెక్టరేట్ వద్ద జర్నలిస్టు సంఘాల ధర్నా
- అదనపు కలెక్టర్ బి.చంద్రశేఖర్‌కు వినతిపత్రం
- జిల్లాలో పలుచోట్ల జర్నలిస్టు సంఘాల నిరసనలు



అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టు సంఘాల నాయకులు



సంగారెడ్డి జోన్: ఆంధ్రప్రదేశ్‌లో 'సాక్షి'మీడియాపై, ఎడిటర్ ఆర్.ధనంజయ్‌రెడ్డిపై ఏపీ ప్రభుత్వం పోలీసులతో అక్రమ కేసులు పెట్టిస్తోందని ఇది పత్రికాస్వేచ్ఛను కాలరాయడమేనని పలువురు పాత్రికేయులు మండిపడ్డారు. 'సాక్షి'మీడియాపై, ఎడిటర్ ఆర్.ధనంజయ్‌రెడ్డిపై ఏపీ పోలీసులు నమోదు చేస్తున్న అక్రమ కేసులను నిరసిస్తూ శుక్రవారం జిల్లా వ్యాప్తంగా పలు జర్నలిస్టు సంఘాలు ప్రజాసంఘాలు, పలు రాజకీయ పార్టీలు ఆందోళన కార్యక్రమాలు చేపట్టాయి. సంగారెడ్డిలో పలు పాత్రికేయ సంఘాల ఆధ్వర్యంలో జర్నలిస్టులు కలెక్టరేట్ ముందు ధర్నా, నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు బండారి యాదగిరి మాట్లాడుతూ...ప్రజా సమస్యలను ఎత్తి చూపుతున్న 'సాక్షి'మీడియాను ఏపీలోని చంద్రబాబు సర్కారు అణిచి వేసే ప్రయత్నం చేస్తోందని ఇటువంటి చర్యలు ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. ఇది పత్రికా స్వేచ్ఛపై జరుగుతున్న దాడిగా అభివర్ణించారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మీడియాను కట్టడి చేసేందుకు తప్పుడు కేసులు పెడుతూ జర్నలిస్టులను భయభ్రాంతులకు గురి చేస్తూ పత్రికల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగానికి విరుద్ధంగా పోలీసులు వ్యవహరిస్తున్న తీరును ప్రజాస్వామ్య వాదులందరూ ఖండించాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు సర్కారు తన తీరు మార్చుకోని పక్షంలో తమ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం అదనపు కలెక్టర్ బి.చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే ఎలక్ట్రానిక్ మీడియా విభాగం జిల్లా అధ్యక్షుడు అనిల్, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర నాయకులు పానుగంటి కృష్ణ, తెలంగాణ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు అసోసియేషన్ (టెంజు) జిల్లా అధ్యక్షుడు అక్కపల్లి యోగానందరెడ్డి, టీయూడబ్ల్యూజే 143 రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి.శ్రీధర్‌గౌడ్, కందిలి ఎడిటర్ సురకంటి రాజేందర్‌రెడ్డి, సీనియర్ జర్నలిస్టులు శివ, కాకోల్ల నాగరాజు, నాగేశ్‌గౌడ్, శివశంకర్‌రావు, సాయినాథ్, వీరేందర్, అన్వర్, విల్సన్, పరంజ్యోతి, ఈశ్వర్, రాజు, విజయ్‌రావు, యాదగిరి, 'సాక్షి'బ్యూరోఇన్‌చార్జి పి.బాలప్రసాద్, స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శివప్రసాద్, రిపోర్టర్లు రాజశేఖర్, రామలింగుబాలయ్య, ఆంజనేయులు, వెంకటేశం, నర్సింహులు, ప్రశాంత్‌గౌడ్, నర్సింహులు, శ్రీనాథ్, వేణు, నగేశ్, నవాజ్, 'సాక్షి'టీవీ రిపోర్టర్లు మహేశ్, ప్రదీప్, నరేశ్, సంతోశ్ తదితరులు పాల్గొన్నారు.

సివిల్స్‌కు ఎంపికైతే దేశ సేవ చేయవచ్చు

కలెక్టర్ ప్రావీణ్య



విద్యార్థుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

సంగారెడ్డి: సివిల్ సర్వీస్ అనేది పరీక్ష మాత్రమే కాదని ఆ పరీక్షలు పాసయితే దేశానికి సేవచేసే అవకాశం లభిస్తుందని కలెక్టర్ పి.ప్రావీణ్య పేర్కొన్నారు. ప్రణాళికతో విశ్లేషణాత్మకంగా చదివితే గ్రామీణ విద్యార్థులు కూడా ఉన్నతస్థాయికి చేరుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. సుల్తాన్పూర్‌లోని జేఎన్టీయూ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన కెరీర్ గైడెన్స్ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. అంతకుముందు చౌటకూర్ మండలం తాడ్దాన్‌పల్లి, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంతోపాటు సుల్తాన్పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం తాడ్దాన్‌పల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇంజనీరింగ్ విద్యార్థుల్లో సహజంగా ఉండే విశ్లేషణాత్మకతను మరింత మెరుగుపరచుకుంటే, వారు యూపీఎస్సీ, గ్రూప్స్ వంటి పోటీ పరీక్షల్లో కూడా రాణించగలరని వివరించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య ఉన్న తేడాలు విద్యార్థుల లక్ష్యసాధనకు అడ్డంకిగా భావించవద్దని ధైర్యం చెప్పారు.

ఇందిరమ్మ ఇళ్లు త్వరగా పూర్తి చేయాలి

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఇళ్ల నిర్మాణాలకు ఇసుక కొరత రాకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఇళ్ల నిర్మాణ స్థాయిని బట్టి వెంటనే బిల్లులు చెల్లిస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. మెనూ ప్రకారమే విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

చేపపిల్లల పంపిణీకి ఏర్పాట్లు

సంగారెడ్డి జోన్: జిల్లాలో చేపపిల్లల పంపిణీ కోసం ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...చేప పిల్లల నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. నాణ్యమైన చేప పిల్లలనే చెరువుల్లో విడుదల చేయాలని స్పష్టం చేశారు. ఎంపీడీవోలు ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేసి, పంచాయతీ కార్యదర్శులకు బాధ్యతలు అప్పగించి ఈ కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు.

పూడికతీత పనులెప్పుడో!

- కాల్వల్లో పేరుకుపోయిన పూడిక
- ఉపాధి హామీలో పూడిక తీయాలంటున్న ఇరిగేషన్ అధికారులు
- రెండు శాఖల మధ్య కొరవడిన సమన్వయం
- చెరువులన్నీ నిండినా ఆయకట్టుకు నీరు అందని దుస్థితి



కిసాన్ సాగర్ చెరువు కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు,పిచ్చి మొక్కలు



కందిలోని పడిగొనికుంట చెరువు కాలువలో పెరిగిన పిచ్చి మొక్కలు,చెట్లు

కంది(సంగారెడ్డి): చిన్న నీటి వనరులైన చెరువులు, కుంటలు నిండి ఉన్నా అధికారుల నిర్లక్ష్యంతో ఆయకట్టుకు నీరందని దుస్థితి నెలకొంది. చెరువుల నుంచి ఆయకట్టుకు నీరు అందించేందుకు ఏర్పాటు చేసిన ఫీడర్ చానళ్లు (కాలువలు) పిచ్చి మొక్కలు, ముళ్ల చెట్లు వ్యర్థాలతో నిండి పోయాయి. పంటకు నీరందించే కాలువల్లో నిండిన పూడికను చాలా రోజుల నుంచి తొలగించకపోవడంతో నీరు పారేందుకు వీలు లేకుండా అధ్వానంగా మారాయి. దీంతో ఆయకట్టు కింద పంటలు సాగు చేస్తున్న రైతులు పంటల సాగుకు బోర్లపైనే ఆధార పడాల్సి వస్తుందని వాపోతున్నారు.

అప్పట్నుంచీ పట్టించుకోలేదు

గత ప్రభుత్వ హయాంలో మిషన్ కాకతీయ ద్వారా చెరువులు, కుంటల్లో పూడికను తొలగించి వదిలేశారు. కాలువలను ఇప్పటివరకు పట్టించుకోకపోవడంతో పలుచోట్ల ముళ్ల చెట్లు పెరిగి ఫీడర్ చానళ్లు అధ్వానంగా తయారయ్యాయి. గతంలో చెరువులు, కుంటలు, కాలువల నిర్వహణను ఇరిగేషన్ శాఖ పూర్తిస్థాయిలో చేపట్టింది. అయితే గత ఆరేళ్ల నుంచి ఫీడర్ చానళ్లలో ఏర్పడిన పూడికను ఉపాధి హామీ పథకం ద్వారా తొలగించాలని ఆదేశాలున్నప్పటికీ ఆశాఖ ద్వారా పనులు జరగడం లేదని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. అయితే ఇతర పనులు చేపట్టడం వల్ల అక్కడక్కడ కాల్వలో ఏర్పడిన పూడికను తీసినా అది పూర్తిస్థాయిలో చేయలేదని ఉపాధి హామీ అధికారులు చెబుతున్నారు.

పూడికతో 50% కూడా నీరందని వైనం

జిల్లాలో1,741 చెరువులు, కుంటలు ఉండగా మొత్తం ఆయకట్టు 72,082 ఎకరాలు ఉంది. ప్రస్తుతం పలు చెరువులు, కుంటలు కాలువల్లో పూడిక నిండటంతో 50% నీరు కూడా అందని పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి కాల్వల్లో ఏర్పడిన పూడికను తొలగించి ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరు అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పూడిక తొలగించాల్సి ఉంది

ఫీడర్ చానళ్లలో పూడిక ఏర్పడిన మాట వాస్తవమే. పూడికతీతకు నిధులు లేకపోవడంతో ఈ పనులను ఉపాధి హామీ శాఖకు అప్పగించారు. పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు ఇచ్చాం. ఆశాఖ అధికారులతో చర్చించి పూడికతీతకు చర్యలు తీసుకుంటాం.

– బాల గణేశ్, ఇరిగేషన్ డీఈ

క్లుప్తంగా

ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌లో ఉచిత శిక్షణ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని వన్‌స్టెప్ ఫ్యాషన్ డిజైనింగ్ ఆధ్వర్యంలో ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌పై ఐదు రోజుల పాటు ఉచిత శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు ఇనిస్టిస్ట్యూట్ డైరెక్టర్ హారిక, రవీందర్ శుక్రవారం తెలిపారు. గ్లాస్ , ఫ్యాబ్రిక్ పెయింటింగ్, టై అండ్ డై, పాట్ పెయింటింగ్ , మధుబని ఆర్ట్స్, క్యాన్వాస్ పెయింటింగ్, రివర్స్ ఆర్ట్, ట్రక్ ఆర్ట్‌పై ఈ నెల 26 నుంచి 31 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. శిక్షణ పొందిన అభ్యర్థులకు సర్టిఫికెట్‌లు అందించనున్నారు. ఆసక్తి కల్గిన వారు 90109 40078కు ఫోన్ చేసి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థి



స్వప్నను అభినందిస్తున్న ఎంఈఓ సత్యనారాయణ రెడ్డి

దుబ్బాకటౌన్: 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు విద్యార్థిని ఎంపికైందని రాయపోల్ విద్యాశాఖ అధికారి సత్యనారాయణ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా మండలంలోని రాంసాగర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థిని పి.స్వప్నను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజ్ఞాపూర్‌లో జరిగిన జోనల్ స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌లో అండర్ -14 విభాగంలో విద్యార్థి ఎంపికావడం సంతోషంగా ఉందన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో 11 మందికి జరిమాన

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన విధించింది. ఈ ఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్ వివరాల ప్రకారం.. గురువారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 11 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా 11 మందికి రూ. వెయ్యి చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు.

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు గల్లంతు

పుల్‌కల్(అందోల్): సింగూరు ప్రాజెక్టులో మత్స్యకారుడు నీటిలో మునిగి గల్లంతయ్యాడు. వివరాలు ఇలా... మండల పరిధిలోని సింగూరు గ్రామానికి చెందిన దాసరి కుమార్ (35) శుక్రవారం ఉదయం తోటి మత్స్యకారులతో కలిసి ప్రాజెక్టులోకి చేపల వేటకు వెళ్లాడు. తెప్పపైనుంచి ప్రమాదవశాత్తు నీటిలోకి పడిపోయాడు. తోటి మత్స్యకారులు గమనించి డ్యాంలో వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది.



ఇక్రిసాట్‌లో మహిళలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

సాగుపై మహిళా రైతులకు అవగాహన

చేగుంట(తూప్రాన్): మండలంలోని పలు గ్రామాల మహిళా రైతులు సెహగల్ ఫౌండేషన్ హైటెక్ సీడ్స్ ప్రతినిధుల సౌజన్యంతో శుక్రవారం ఇక్రిసాట్ సందర్శనకు వెళ్లారు. పరిశోధనాలయంలో వారికి పెరటి తోటల పెంపకం, డ్రమ్ సీడర్, వరి పంట, డ్రిప్ ద్వారా పంటలు సాగు చేసే విధానం గురించి అవగాహన కల్పించారు. భూమి చదును, వర్మీకంపోస్టు తయారీ, పంటలను ఆశించే క్రిమి కీటకాలు, వాటి నివారణ చర్యల గురించి ప్రయోగశాలలో రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సెహగల్ ఫౌండేషన్ ప్రతినిధులు నీరజ్ కుమార్, అవినాష్, ఫీల్డ్ అసిస్టెంట్లు విజయ్, శ్రవణ్, బాబు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే ఆనందకేళి

- బాణాసంచా కాల్చేటప్పుడు జాగ్రత్తలు తప్పనిసరి
- సూచిస్తున్న నిపుణులు
- పిల్లలు కాల్చేటప్పుడు పెద్దలు పక్కనే ఉండాలి

సంగారెడ్డి క్రైమ్: దీపావళి పండుగలో పెద్దల కంటే పిల్లల సందడే ఎక్కువ. బాణాసంచా పేల్చే సమయంలో జాగ్రత్తలు పాటించాలి. పండుగను సంతోషంగా జరుపుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. టపాకాయలు కాల్చే సమయంలో చిన్నారులు, వృద్ధులు జాగ్రత్తగా ఉండాలి. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా.. ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. చిన్న పాటి కారణాల వల్ల ప్రతి సంవత్సరం చాలా మంది ప్రమాదాలకు గురవుతున్నారు. జిల్లాలో కంటి చూపు కోల్పోయిన సందర్భాలు ఉన్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ముఖ్యంగా గ్యాస్ సిలిండర్లు మండే పదార్థాలు



టపాకాయలకు దూరంగా ఉంచాలి.
- ఇంట్లో, మేడపై కాల్చడానికి ప్రయత్నించవద్దు. బహిరంగ ప్రదేశాలు, ఆరు బయట మాత్రమే కాల్చాలి.
- ఎలాంటి అగ్ని ప్రమాదాలు సంభవించినా వెంటనే మంటలను అదుపు చేసేందుకు బకెట్‌లతో నిండుగా నీళ్లను పక్కన పెట్టుకోండి.
- నిప్పు రవ్వలు దుస్తులపై పడితే అవి త్వరగా వ్యాపించకుండా ఉండేందుకు పిల్లలతో పాటు పెద్దలు కాటన్ దుస్తులని ధరించాలి.
- గాయాలైనప్పుడు సెప్టిక్ కాకుండా నిరోధించేందుకు బర్నల్ లేదా దూది అయోడిన్ తదితర కూడిన ఫస్ట్ ఎయిడ్ కిట్టు అందుబాటులో ఉంచుకోవాలి.
- పిల్లలు కాల్చే సమయంలో పెద్దలు పక్కనే ఉండటం అత్యంత శ్రేయస్కరం.

ఇవి తప్పనిసరి

- టపాకాయలను ఒకసారి అంటించిన తర్వాత వెలగలేదని చూసేందుకు దగ్గరకు వెళ్లవద్దు. ప్రమాదవశాత్తు కొన్నిసార్లు పేలే ప్రమాదం ఉంటుంది.
- ఏమాత్రం జాగ్రత్తగా ఉన్న నిప్పు రవ్వలు పూరి గుడిసెలు, గడ్డివాములపైకి దూసుకెళ్లి అగ్ని ప్రమాదాలు సంభవిస్తాయి.
- చుడీదార్ వేసుకునేవారు వదులుగా ఉన్నవి కాకుండా బిగుతుగా ఉండేవి వేసుకోవాలి.
- పర్యావరణ హితమైన టపాకాయలు (గ్రీన్) వాడితే మంచిది.

జాగ్రత్తలు పాటించాలి



చిన్నపిల్లలకు టపాకాయలు అందకుండా, సిలిండర్‌కు దూరంగా ఉంచడం మంచిది. చేతులతో పట్టుకొని పేల్చటం ప్రమాదకరం. భారీగా కాల్చటం వల్ల పొగతో శ్వాసకోశ సమస్యలు, వినికిడి ఇబ్బందులు వస్తాయి. శరీరానికి మంటలు అంటుకుంటే అదుపు చేసి, కాలిన గాయాలను నీళ్లతో శుభ్రం చేయాలి. వెంటనే దగ్గరలోని ఆస్పత్రికి తరలించాలి.

– ఉష దాక్టర్, సంగారెడ్డి

అజాగ్రత్త వద్దు



టపాకాయలు కాల్చేటప్పుడు ఏ మాత్రం అశ్రద్ధ వహించొద్దు. ముఖ్యంగా పిల్లలు కాల్చేటప్పుడు తల్లిదండ్రులు పర్యవేక్షించాలి. ప్రమాదాల బారిన పడకుండా ఆనందంగా పండుగను జరుపుకోవాలి.

– బి.నాగేశ్వరరావు, అగ్నిమాపక అధికారి

ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించాలి

ఎస్పీ పరితోష్ పంకజ్



సంగారెడ్డి జోన్: దీపావళి పండుగను పురస్కరించుకుని ఏర్పాటు చేసే టపాకాయల దుకాణదారులు ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించాలని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఓ ప్రకటనలో తెలిపారు. జనావాసాలకు దూరంగా దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. తాత్కాలికంగా దుకాణాలు ఏర్పాటు చేసే వ్యాపారులు తప్పనిసరిగా సంబంధిత సబ్-డివిజన్ పోలీసు అధికారుల నుంచి అనుమతి తీసుకోవాలని సూచించారు. ఎవరైనా పోలీసుల నుంచి అనుమతి లేకుండా ఏర్పాటు చేస్తే ఎక్స్ ప్లోజివ్ యాక్టు 1884 ప్రకారం చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

దుకాణాదారులు పాటించాల్సిన నిబంధనలు

- దుకాణాలు జనావాసాలకు దూరంగా, ఖాళీ ప్రదేశాల్లో ఏర్పాటు చేసుకోవాలి.
- దుకాణం ఉన్న ప్రదేశానికి స్థల యజమాని నుంచి ఎన్‌ఓసి సర్టిఫికెట్ పొంది ఉండాలి.
- దుకాణాల మధ్య వ్యత్యాసం 3 మీటర్లు, గృహ నిర్మాణాలకు 50 మీటర్ల దూరంలో ఉండాలి.
- జనాలు రద్దీగా ఉండే ప్రదేశాల్లో ఎలాంటి టపాకాయల షాపులు ఏర్పాటు చేయరాదు.
- ఫైర్ ఆక్సిడెంట్‌కు సంబంధించి తక్షణం స్పందించే విధంగా ఫైర్ సేఫ్టీ పరికరాలు అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. నిబంధనలు ఉల్లఘించే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి ఆత్మహత్య



మాణయ్య

హవేళిఘణాపూర్(మెదక్): మతి స్థిమితం లేని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని మక్తభూపతి పూర్ గ్రామంలో శుక్రవారం వెలుగు చూసింది. వివరాలు ఇలా... గ్రామానికి చెందిన బక్కన్నగారి మాణయ్య(47) పదేళ్ల క్రితం హైదరాబాద్‌కు బతుకు దెరువు నిమిత్తం వెళ్లారు. కాగా స్వగ్రామానికి వెళ్తానని చెప్పి ఇంటికి వచ్చాడు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. వెంటనే మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు..



సాయికుమార్

తూప్రాన్: అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని జేండావల్లి సమీపంలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ శివానందం వివరాల ప్రకారం... శివ్వంపేట మండలం దంతాన్‌పల్లి గ్రామానికి చెందిన గొల్ల నాగరాజుకు ముగ్గురు కూతుళ్లు. మగ సంతానం లేకపోవడంతో పెద్ద కూతురుకు ఇళ్లరికం అల్లుడిని తెచ్చుకోవాలనుకున్నాడు. ఈ క్రమంలో సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం దౌలాపూర్ గ్రామానికి చెందిన పెద్దగొల్ల సాయికుమార్ (20)ను ఆరు నెలల క్రితం ఇంటికి తీసుకువచ్చాడు. కాగా ఈ నెల 15న అతడు మద్యం తాగి ఇంటికి వచ్చాడు. దీంతో నాగరాజు అతడ్ని మందలించాడు. ఆ రోజు రాత్రి 9గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లిన సాయికుమార్ తిరిగి రాలేదు. చుట్టు పక్కల వెతికినా ఎలాంటి ఆచూకీ లభించలేదు. వెంటనే శివ్వంపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం హల్దీవాగులో శవమై తేలాడు.

ఉద్యోగం పేరుతో సైబర్ మోసం

రూ.12,500 పోగొట్టుకున్న వివాహిత

జహీరాబాద్: వివాహిత సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కి నగదు పోగొట్టుకుంది. బాధితురాలి కథనం ప్రకారం... నారాయణఖేడ్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహిత ఇన్‌స్టాగామ్‌లో రీల్స్ చూడగా రైల్వే ఉద్యోగం కోసం సంప్రదించాలని ఉండటంతో అందులో ఉన్న నంబర్‌కు ఈనెల 15న కాల్ చేసింది. ముందుగా ఐడీ కార్డు కోసం రూ.800 చెల్లించాలని సైబర్ నేరగాడు చెప్పగా ఆమె ఫోన్‌పే ద్వారా డబ్బులు చెల్లించింది.అలాగే వెరిఫికేషన్ కోసం రూ.7,250, కార్డు రావాలంటే మరో రూ.5,250 చెల్లించాలని చెప్పగా డబ్బులు పంపించింది. వెరిఫికేషన్ కావడం లేదని, మరో రూ.5వేలు పంపించాలని సైబర్ నేరగాడు చెప్పాడు. దీంతో మీరు ఎక్కడ ఉంటారని బాధితురాలు ప్రశ్నించగా తాను జహీరాబాద్ రైల్వే స్టేషన్‌లో ఉద్యోగం చేస్తానని సమాధానం ఇచ్చాడు. దీంతో బాధితురాలు తన తాత వినాయక్‌రావును వెంట బెట్టుకుని శుక్రవారం రైల్వే స్టేషన్‌కు వచ్చింది. స్టేషన్ మేనేజర్‌ను సంప్రదించగా విషయం వెలుగు చూసింది. దీంతో మోసపోయినట్లు గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

విద్యార్థి మృతిపై ఎస్సీ కమిషన్ విచారణ

వారం రోజుల్లో బాధ్యులపై చర్యలు



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సీ కమిషన్ డైరెక్టర్ సునీల్‌కుమార్ బాబు

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని పోతారం(ఎస్)లోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఈ నెల 7న 8వ తరగతి విద్యార్థి వివేక్ అనుమానాస్పదంగా మరణించాడు. శుక్రవారం జాతీయ ఎస్సీ కమిషన్ డైరెక్టర్ జి.సునీల్‌కుమార్ బాబుతో పాటు కలెక్టర్ హైమావతి, సీపీ విజయ్‌కుమార్ పాఠశాలకు వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. విద్యార్థి తల్లిదండ్రులతో మాట్లాడి వివరాలు సేకరించారు. పాఠశాలలో ఆ రోజు ఎంతమంది విద్యార్థులు ఉన్నారు? అక్కడ ఉపాధ్యాయులు ఎవరెవరు ఉన్నారనే వివరాలు తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులు, ప్రిన్సిపాల్స్‌ను విచారించారు. కేసు దర్యాప్తు చేస్తున్న ఏసీపీ, సీఐలను కేసు విచారణ గురించి ప్రశ్నించారు. విద్యార్థికి పోస్టుమార్టం చేసిన డాక్టర్లను పిలిపించి మృతదేహంపై గాయాల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ కేసు దర్యాప్తు నెలలో పూర్తి అవుతుందని, వారం రోజుల్లో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించినట్లు వివరించారు. వీరివెంట అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, ఆర్డీవో రాంమూర్తి, తహసీల్దార్ లక్ష్మారెడ్డి, ఎంపీడీఓ రమేశ్ ఉన్నారు.

కుక్కల దాడిలో లేగదూడ మృతి



మృతి చెందిన లేగదూడ వద్ద రోదిస్తున్న రైతు తిరుపతి

అక్కన్నపేట(హుస్నాబాద్): కుక్కల దాడిలో ఓ లేగదూడ మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని మోత్కులపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన మడక తిరుపతికి రెండున్నరేళ్ల ఆవుదూడ కుక్కల దాడిలో మరణించింది. దీని విలువ సుమారుగా రూ.40వేల వరకు ఉంటుందని పలువురు రైతులు తెలిపారు. గ్రామంలో కుక్కల బెడద అధికంగా ఉందని, పిల్లలు, వృద్ధులు, పశువులపై దాడులు చేస్తూ గాయపరుస్తున్నాయని గ్రామస్తులు తెలిపారు. సంబంధిత అధికారులు కుక్కల బెడదను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

స్కూటీపై వచ్చి.. చైన్ స్నాచింగ్

సిద్దిపేటకమాన్: యువతి మెడలోంచి గుర్తు తెలియని దుండగులు బంగారు చైన్‌ను లాక్కెళ్లారు. ఈ ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. వన్‌టౌన్ పోలీసుల వివరాల ప్రకారం... పట్టణంలోని భరత్‌నగర్‌కు చెందిన డి.భవిత (22) రోజులాగే శుక్రవారం ఉదయం వాకింగ్‌కు వెళ్లింది. తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో వెనక నుంచి స్కూటీపై వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని దుండగులు యువతి మెడలో నుంచి మూడు తులాల బంగారు గొలుసును తెంపుకెళ్లారు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఘటన జరిగిన ప్రాంతంలో సీసీ పుటేజీలను పరిశీలించారు.

విద్యార్థిని అదృశ్యం

కొండపాక(గజ్వేల్): విద్యార్థిని అదృశ్యమైంది. ఈ ఘటన కుకునూరుపల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బోడపట్ల పోశయ్య కూతురుకు ఇంటర్మీడియెట్ అనంతరం బాసరలోని ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చింది. కానీ వెళ్లకుండా ఇంటివద్దే ఉంటోంది. ఈ నేపథ్యంలో ఈనెల 16న రాత్రి కుటుంబీకులతో కలిసి భోజనం చేసి పడుకుంది. మరుసటి రోజు తెల్లవారుజామున చూసే సరికి కనిపించలేదు. దీంతో కుటుంబీకులు చుట్టు ప్రక్కల, బంధువులకు సమాచారం అందించినా ఫలితం లేక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మా భూముల జోలికొస్తే ఊరుకోం



కబ్జాకు యత్నిస్తున్న స్థలంలో ఆందోళన చేస్తున్న దళిత సంఘం నాయకులు, గ్రామస్తులు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని కట్కూర్ గ్రామంలో దళితుల భూములను కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని శుక్రవారం దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. గ్రామంలోని దోమ రాజిరెడ్డి ఇంటి నుంచి దుబ్బతండా గ్రామానికి వెళ్లే దారి వరకు సుమారుగా 1.20 గుంటల భూమి ఉందన్నారు. ఈ భూమిని సహకార సంఘం వరి ధాన్యం కొనుగోలు పేరిట కబ్జా చేయాలని ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించాలని, లేనిపక్షంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

స్వగ్రామానికి రాంచంద్రారెడ్డి మృతదేహం

- నేడు తీగలకుంటపల్లిలో అంత్యక్రియలు
- గత నెల 22న ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్



కట్టా రాంచంద్రారెడ్డి

కోహెడరూరల్(హుస్నాబాద్): గత నెల 22న ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు నేత కట్టా రాంచంద్రారెడ్డి మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని శనివారం ఉదయం కోహెడ మండలం తీగలకుంటపల్లి గ్రామానికి తీసుకురానున్నట్టు వారి కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా రాంచంద్రారెడ్డి మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఆయన కుమారుడు రాజాచంద్ ఛత్తీస్‌గఢ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. తన తండ్రిని మందుగానే అరెస్ట్ చేసి పోలీసుల కస్టడీలో ఉన్న సమయంలోనే ఎన్‌కౌంటర్ చేశారని ఆయన ఆరోపిస్తూ దీనిపై సిట్ ఏర్పాటు చేయాలని కోరాడు. దీంతో విచారణ పూర్తయ్యే వరకు మృతదేహం దహనం చేయకుండా భద్రపరచాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో శుక్రవారం కేసును డిస్మిస్ చేసింది. దీంతో శనివారం ఉదయం రాంచంద్రారెడ్డి మృతదేహం స్వగ్రామానికి రానుంది.

ఆర్టీసీ బస్సు ఢీకొని..

- ఇద్దరు కూలీల దుర్మరణం
- సిద్దిపేట జిల్లాలో ఘటన



సాయిలు



రాజమల్లు



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ విజయ్‌కుమార్

ములుగు(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో ఇద్దరు కూలీలు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఈ ఘటన ములుగు మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం... మండలంలోని కమలాబాద్ గ్రామానికి చెందిన బోయిని సాయిలు(65), మర్కూక్ మండలం పాములపర్తి గ్రామానికి చెందిన లెంకల రాజమల్లు(55) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రోజు మాదిరిగానే ములుగు రెవెన్యూ కార్యాలయ సమీపంలో రాజీవ్‌రహదారి డివైడర్‌పై గడ్డిని కత్తిరించే పనులు చేస్తున్నారు. ఈ క్రమంలోనే హైదరాబాద్ నుంచి గోదావరిఖని వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు నిర్లక్ష్యంగా, అతివేగంగా వచ్చి కూలీలపై నుంచి వెళ్లింది. ఈ ప్రమాదంలో కూలీలు సాయిలు, రాజమల్లు అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాలు నుజ్జునుజ్జయి రోడ్డుకు అతుక్కుపోయాయి. ఈ మేరకు ఆర్టీసీ డ్రైవర్ మహ్మద్‌రఫీపై కేసు నమోదు చేసి, మృతదేహాలను పోస్టుమార్టమ్ నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా మృతుల కుటుంబాల్లో విషాదం అలుముకుంది. కమలాబాద్‌కు చెందిన మృతుడు సాయిలుకు భార్య భాగ్యమ్మ, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. మరో మృతుడు రాజమల్లుకు భార్య అనసూయ, కూతురు, కుమారుడు ఉన్నారు.

కారు అద్దాలు పగులగొట్టి..

రూ.1.50 లక్షలు చోరీ



కారు వద్ద ఆధారాలను సేకరిస్తున్న పోలీసులు

కంది(సంగారెడ్డి): కారులో ఉన్న నగదును గుర్తు తెలియని దండగులు చోరీ చేశారు. ఈ ఘటన కాశీపూర్ శివారులో చోటుచేసుకుంది. ఇంద్రకరణ్ ఎస్ఐ విజయ్ కుమార్ కథనం ప్రకారం... పటాన్ చెరు మండలం బీరంగూడకు చెందిన పిల్లబోయిన శ్రవణ్ కుమార్ తన కారులో రూ.లక్షా 50 వేలు ఉంచి రిజిస్ట్రేషన్ కార్యాలయంలోకి వెళ్లాడు. కార్యాలయంలో పని ముగించుకుని సాయంత్రం 3:30 గంటల సమయంలో తిరిగి వచ్చి చూసేసరికి కారు అద్దాలు పగులగొట్టి డబ్బుల బ్యాగును అపహరించినట్లు గుర్తించారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా రూరల్ సీఐ క్రాంతికుమార్, టౌన్ సీఐ రమేశ్ ఆధ్వర్యంలో క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు.

నిందితుడికి 20 ఏళ్ల జైలు

దబ్బాకరూరల్: మహిళపై లైంగికదాడి చేసిన ఘటనలో సిద్దిపేట జిల్లా ఫస్ట్ అడిషనల్, సెషన్స్ కోర్టు నిందితునికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు జరిమానా విధించింది. సిద్దిపేట సీపీ విజయ్ కుమార్ వివరాల ప్రకారం... 2018లో చిన్నకోడూరు మండలం, మల్యాల గ్రామానికి చెందిన దరిపల్లి విఠల్(52) దుబ్బాక మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళపై లైంగికదాడి చేశాడు. అప్పట్లో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇరువురి వాదనలు విన్న కోర్టు అనంతరం నేరస్తునికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు, రూ.5వేలు జరిమానా విధించింది. నేరస్తునికి శిక్ష పడేటట్లు కృషి చేసిన సీఐలు పరశురాములు, కృష్ణ, శ్రీనివాస్, ఎస్ఐ కీర్తి రాజు, సిబ్బందిని సీపీ అభినందించారు.

సర్వశిక్ష అభియాన్ ఉద్యోగుల నిరసన



నిరసన తెలుపుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

న్యాల్‌కల్(జహీరాబాద్): రెండు నెలలుగా గౌరవ వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రభుత్వం చర్యలు తీసుకొని వేతనాలు వెంటనే చెల్లించాలని ఎస్ఎస్ఏ (సర్వ శిక్ష అభియాన్) ఉద్యోగులు డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం ఆవరణలో ఉద్యోగులు శుక్రవారం ఉదయం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమయానికి వేతనాలు చెల్లించకపోవడం వల్ల ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే వేతనాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో రవి, మానిక్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రసమయి ఫాంహౌస్‌పై దాడి

- దిష్టిబొమ్మ దహనం, స్వల్ప ఉద్రిక్తత
- పీఎస్‌లో ఫిర్యాదు చేసుకున్న ఇరు పార్టీల నాయకులు



రసమయి ఫాంహౌస్ వద్ద కాంగ్రెస్ నాయకులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు



దాడిలో పగిలిపోయిన ఫాంహౌస్ కిటికీ అద్దాలు

బెజ్జంకి(సిద్దిపేట): కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల గొడవతో మండలంలో శుక్రవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అదనపు డీసీపీ విశాల్ కుషాల్కర్ బెజ్జంకి పోలీస్‌స్టేషన్‌కు వచ్చి పరిస్థితులు పరిశీలించారు. మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణపై మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అనుచిత వ్యాఖ్యలు చేశాడని కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో గుండారంలో గల రసమయి ఫాంహౌస్ ముట్టడికి యత్నించారు. కోడిగుడ్లు, రాళ్లతో దాడి చేయగా అద్దాలు పగిలాయి. ఫామ్‌హౌస్ వద్ద ఏసీపీ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీగా బందోబస్తు ఏర్పాటు చేసి ఫాంహౌస్ వద్దకు వచ్చిన బెజ్జంకి, ఇల్లంతకుంట, గన్నేరువరం మండలాల కాంగ్రెస్ నాయకులను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. స్టేషన్‌లో ఉన్న కాంగ్రెస్ నాయకులను ఎమ్మెల్యే పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. యూత్ కాంగ్రెస్ నాయకులు బెజ్జంకిలో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ దిష్టిబొమ్మను దహనం చేయగా, బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే కవ్వంపల్లి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎమ్మెల్యేను దూషించిన మాజీ ఎమ్మెల్యే రసమయిపై చర్యలు తీసుకోవాలని అదనపు డీసీపీ విశాల్ కుషాల్కర్‌కు ఫిర్యాదు చేశారు. ఏసీపీ రవీందర్‌రెడ్డి, సీఐలు శ్రీను, ఉపేందర్, ఎస్ఐలు సౌజన్య, రాజేశ్, అలీ, పోలీసు, సీఆర్‌పీఎఫ్ జవాన్‌లు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.